క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



ఉద్దేహాళ్‌లో మలేరియాపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని ఉద్దేహాళ్ లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ర్యాలీ చేశారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన , జైనాబీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు ఆర్థికసాయం

కళ్యాణదుర్గం: విష జ్వరంతో బాధపడుతున్న చిన్నారి దేవీప్రియ మెరుగైన చికిత్స కోసం ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ.20 వేల ఆర్థికసాయం అందించారు. మల్లిపల్లికి చెందిన గురుస్వామి కుమార్తె దేవీప్రియ కొన్ని రోజులుగా విషజ్వరంతో బాధపడుతోంది. బెంగళూరు సెయింట్ జాన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మెరుగైన చికిత్స కోసం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబ సభ్యులకు సంస్థ చైర్మన్ బద్దేనాయక్, వైస్ చైర్మన్ సురేష్ తదితరులు ఆర్థికసాయం అందించారు.

18 నుంచి డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు

రాయదుర్గం రూరల్: కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఈనెల 18 నుంచి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రఘురామమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు సంబంధించిన సింగిల్ మేజర్ సబ్జెక్టులు ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు, కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్ , మైక్రో బయాలజీ, మ్యాథమేటిక్స్ , ఫిజిక్స్, బోటనీ కోర్సులు ఉన్నాయన్నారు. వివరాలకు సెల్: 9030260294, 9738404413, 9398617197లో సంప్రదించాలన్నారు.

మద్యంషాపుల మూసివేత



కేబీ ప్యాలెస్ రోడ్డులోని మద్యం దుకాణాన్ని మూసివేసిన ఎక్సైజ్ అధికారులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు మూసివేశారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని ఆరు మద్యం దుకాణాలు సీజ్ చేసి, బంద్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం అర్ధరాత్రి దాకా మూసేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కౌంటింగ్ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం అమ్మినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ



పాల్తూరులో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలపై ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు పీహెచ్‌సీ వైద్యురాలు అరుణకుమారి ఆధ్వర్యంలో సోమవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. పాల్తూరు,విడపనకల్లు,పెద్ద కొట్టాలపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ప్రతి గ్రామంలో ఈనెల 30 వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉరవకొండ మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి తెలిపారు. సోమవారం పాల్తూరులో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలకు సంబంధించి బీసీ కాలనీ, ఇందిరానగర్,అగ్గి నగర్ కాలనీలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు, సుధాకర్, యశోద, స్టాఫ్ నర్సు జయలక్ష్మి,ఆరోగ్య కార్యకర్తలు సుధాకర్, సుశీల, వాసు, సీతమ్మ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే మలేరియా నిర్మూలన

కూడేరు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందవని, మలేరియా రాదని మండల వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి తెలిపారు. సోమవారం మలేరియా మాసోత్సవాల్లో భాగంగా కూడేరులో వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రవీంద్ర, యశోధ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

- హెచ్చెల్సీ అండర్ టన్నెల్‌కు గండి
- పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం



ఉద్దేహాళ్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి హగరి నది



బెళుగుప్ప - అనంతపురం రహదారిపై స్తంభించిన రాకపోకలు

బొమ్మనహాళ్ : బొమ్మనహాళ్ మండలంలో ఆదివారం అర్ధరాత్రి కుండపోత వర్షం కురిసింది. దీంతో మండలంలోని వేదావతి హగరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వేదావతి హగరికి భారీగా వరద నీరు రావడంతో ఉద్దేహాళ్ వంతెనపై వరద నీరు పారింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తుంగభద్ర ఎగువ కాలువకు అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రధాన కాలువలో వరద నీటికి 119-400 కిలోమీటరు వద్ద యూటీ అండర్ టన్నెల్ ఛానల్‌కు గండి పడింది. కాలువలో వర్షపు నీరు 4 అడుగుల మేర ప్రవహించింది. కొలగానహళ్లి వద్ద కబ్బాలి వంక భారీ వరద నీటితో ఉధృతంగా పారింది. బొమ్మనహాళ్ మండలంలో 91.0 మి.మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. బొమ్మనహాళ్‌తో పాటు రంగాపురం క్యాంపు, ఉద్దేహాళ్, దేవగిరి, మైలాపురం, ఏళంజి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది

పత్తి, మొక్కజొన్న పంటలు నష్టం: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంటలు నీట మునిగాయి. ఉద్దేహాళ్, గొనూరు, రంగాపురం క్యాంపు, కొలగానహళ్లి తదితర గ్రామాల్లో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిని, అపార నష్టం వాటిల్లింది. పత్తి పంట చేతికొచ్చిన దశలో ఉండగా భారీ వర్షానికి నష్టపోవాల్సి వచ్చిందని రైతులు అంటున్నారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. 9.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి.

ముద్దలాపురం చెరువుకు జలకళ

కూడేరు మండలంలోని ముద్దలాపురం చెరువుకు జలకళ వచ్చేసింది. ఆదివారం రాత్రి ముద్దలాపురం పైభాగాన ఉన్న పి.నారాయణపురం, చోళసముద్రం గ్రామాల్లో జోరుగా వాన కురిసింది. దీంతో పి.నారాయణపురం వద్ద వెళ్లిన హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ నుంచి చెరువుకు నీరు సరఫరా చేసేందుకు తవ్విన పిల్ల కాలువలు, వంకల ద్వారా పెద్ద ఎత్తున వర్షపునీరు ముద్దలాపురం చెరువులోకి చేరింది.

కరువుతీరా వర్షం..రైతుల హర్షం

బెళుగుప్ప: బెళుగుప్ప మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలతో ప్రధాన చెరువులకు నీరు చేరుతోంది. ఆదివారం రాత్రి వర్షపాతం 80.4 మి.మీ వర్షపాతం నమోదైందని ఏఓ పృథ్వీసాగర్ తెలిపారు. బెళుగుప్ప మంగోటి చెరువు, బ్రాహ్మణపల్లి చెరువు, శీర్పి, శ్రీరంగాపురం , గుండ్లపల్లి చెరువులకు నీరు వచ్చి చేరింది. భారీ వర్షాలకు బెళుగుప్ప నుంచి ఉరవకొండకు, బెళుగుప్ప నుంచి అనంతపురానికి వెళ్లే ప్రధాన రహదారుల్లోని బెళుగుప్ప పెద్ద వంక పారుతుండడంతో రాకపోకలు స్తంభించాయి.

కణేకల్లులో 80 ఎంఎం వర్షపాతం నమోదు

కణేకల్లు: మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షపాతం 80 ఎంఎంగా నమోదైంది. కణేకల్లు హెడ్‌క్వార్టర్‌లో వర్షపాతం 80 ఎంఎం మోతాదులో వచ్చినా... పరిసర ప్రాంతాల్లో అంతకు మించి వర్షం దంచికొట్టింది. కణేకల్లు క్రాస్, యర్రగుంట, ఆదిగానిపల్లి, కొత్తపల్లి, రచ్చుమర్రి, మాల్యం తదితర గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో వంగలు, వాగులు పొంగి ప్రవహించాయి.

దంచికొట్టిన వాన

- పరవళ్లు తొక్కిన వేదావతి
- నీట మునిగిన పంట పొలాలు
- సోములాపురం వద్ద ఆగిన రాకపోకలు



కణేకల్లు-మాల్యం రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

రాయదుర్గం: రాయదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సోమవారం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయం కాగా, పత్తి, ఆముదం, సద్ద, ఉల్లి, మొక్కజొన్న, మిర్చి పంటలు నీటమునిగాయి. డివిజన్‌లోని అత్యధికంగా బొమ్మపహాళ్ మండలంలో 91.0 ఎంఎం వర్షపాతం, శెట్టూరులో 4.2 ఎంఎంతో వర్షపాతం నమోదైంది. కర్ణాటక రాష్ట్రంలో విస్తారంగా వానలు కురవడంతో ఏపీలోని దిగువనున్న గ్రామాలకు వరదనీరొచ్చి చేరుతోంది. డీ హీరేహాళ్ మండలంలోని సోములాపురం వద్ద వేదావతి నది పరవళ్లుతొక్కింది. బళ్లారి- రాయదుర్గం ప్రధాన రహదారిలో 5 కిలో మీటర్ల మేర వాహనాలు ఆగిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టాక రాకపోకలు సాగాయి. నియోజకవర్గంలోని మెజార్టీ చెరువులు జలకళ సంతరించుకున్నాయి. చెక్‌డ్యామ్‌లు, కుంటలు పొంగిపొర్లాయి. బీటీప్రాజెక్టు లోకి వరదనీటి ప్రవాహం మొదలైంది.

416.2 ఎంఎం వర్షపాతం నమోదు : డివిజన్‌లోని రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో కురిసిన భారీ వర్షానికి 416.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్‌లో అత్యధికంగా 91.0 ఎంఎం, శెట్టూరులో 4.2 ఎంఎం వర్షపాతం నమోదు కాగా, రాయదుర్గం 43.2, డీ హీరేహాళ్ 50, కణేకల్లు 80, గుమ్మఘట్ట 9.4, కళ్యాణదుర్గం 23.4, కుందుర్పి 16.4, బ్రహ్మసముద్రం 12.2, బెళుగుప్ప 84.2, కంబదూరు 16.4 ఎంఎం వర్షపాతం నమోదైంది.

పొంగి ప్రవహించిన వేదవతి నది..

వేదవతి హగిరికి వరదనీటితో పొంగి ప్రవహిస్తోంది. కణేకల్లు-మాల్యం మార్గమధ్యంలో వేదవతి హగిరిలో వేసిన రోడ్డు వరదతాకిడికి కొట్టుకోపోయింది. రోడ్డుపై నాలుగైదు అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తున్నాయి. కణేకల్లు-ఉరవకొండకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఉరవకొండ నుంచి రాయదుర్గంకెళ్లే బస్సులన్నీ మాల్యం వరకు వచ్చి, అటు నుంచి అటే వెనక్కి వెళ్తున్నాయి. మాల్యంలోనే ప్రయాణికులు దిగాల్సి రావడంతో కణేకల్లుకు చేరుకోవడానికి అగచాట్లు పడుతున్నారు. ఇదిలా ఉండగా నాగేపల్లి, సొల్లాపురం, పెనకలపాడు వద్ద వంకలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.



బెళుగుప్ప మంగోటి చెరువుకు వచ్చి చేరిన వర్షపునీరు



ఉద్దేహాళ్ వద్ద నీట మునిగిన పత్తి పంట



రాయదుర్గం వద్ద ఆగిన రాకపోకలు



బెళుగుప్ప- ఉరవకొండకు వెళ్లే రహదారిపై స్తంభించిన రాకపోకలు

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

- కళ్యాణదుర్గం డీఎస్పీ బి. శ్రీనివాసులు



మాట్లాడుతున్న డీఎస్పీ బీ శ్రీనివాసులు

రాయదుర్గం/కళ్యాణదుర్గం రూరల్/ రాయదుర్గం, కళ్యాణదుర్గం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా ఎస్పీ గౌతమి శాలి ఆదేశాల మేరకు పటిష్ట చర్యలు చేపట్టామని డీఎస్పీ బీ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక అర్బన్ పీఎస్‌లో సీఐ శ్రీనివాసులు, ఎన్నికల అధికారి అల్తాఫ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. డీఎస్పీ మాట్లాడుతూ మంగళవారం ఓట్ల లెక్కింపు సందర్భంగా డివిజన్ వ్యాప్తంగా 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్ అమలులోకి తెచ్చామన్నారు. రాయదుర్గంలో 11 కళ్యాణదుర్గంలో 9 గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి, ప్రత్యేక మొబైల్ బృందాల ద్వారా పర్యవేక్షణ చేయిస్తున్నట్లు తెలిపారు. రౌడీషీటర్లు, పాతనేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమిస్తే రౌడీషీట్లు తెరుస్తామన్నారు. హింసాత్మక ఘటనలు జరిగితే 100కు డయల్ చేయాలన్నారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతిలేదు

ఎన్నికల ఫలితాల తర్వాత విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ హరినాథ్, పోలీస్‌లు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో పార్టీల నాయకులు విజయోత్సవ ర్యాలీలు చేయరాదని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని గొల్లపల్లి, కేపీ దొడ్డి, నేత్రపల్లి , భూపసముద్రం గ్రామాల్లో పర్యటించి, ప్రజలను హెచ్చరించారు.

కూడేరు: ఓట్ల లెక్కింపు తర్వాత ప్రత్యర్థులకు బెదిరింపు పోస్టులు పెడితే, అలాంటి వారిపై రౌడీషీట్ తెరుస్తామని సీఐ శివరాముడు హెచ్చరించారు. సోమవారం తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

- కౌంటింగ్ ఏజెంట్లతో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య



కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఎన్నికల కౌంటింగ్‌కు బయలుదేరిన ఏజెంట్లు


కళ్యాణదుర్గం: ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య సూచించారు. సోమవారం కౌంటింగ్ ఏజెంట్లకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కౌంటింగ్ హాలులో ప్రతి ఒక్కరూ ఓట్ల లెక్కింపుపై నిఘా ఉంచాలన్నారు. ఏమరుపాటుగా ఉండకూడదన్నారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి, స్వతంత్రులు, నోటాకు వచ్చే ఓట్లను సైతం జాగ్రత్తగా నమోదు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో పోలైన ఓట్లలో ప్రతి ఓటూ అత్యంత కీలకమని చెప్పారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలన్నారు. అభ్యంతరాలుంటే వెంటనే కౌంటింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కౌంటింగ్ హాల్‌లో అధికారులు తుది ఫలితం వెల్లడించే వరకూ ఏ ఒక్కరూ అక్కడి నుంచి బయటకు రాకూడదన్నారు. విజయావకాశాలు మనకే మెండుగా ఉన్నాయని, అందరూ సంయమనం పాటించాలని రంగయ్య స్పష్టం చేశారు.

నగరేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి అభిషేకాలు, రుద్రాభిషేకం , మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు.జరుట్ల రాంపురంలోని జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు చేశారు.

ఉత్కంఠకు నేడు తెర..!

- ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం
- 30 నిమిషాల్లోనే తొలి రౌండ్ పూర్తి
- మధ్యాహ్నం ఒంటి గంటలోపు ఉరవకొండ ఫలితం
- నాలుగు తర్వాత చివరగా రాయదుర్గం
- ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్
- కౌంటింగ్ కేంద్రానికి చేరుకున్న అభ్యర్థులు, ఏజెంట్లు



రాయదుర్గం: ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓటరు తీర్పు మరి కొద్ది గంటల్లోపు వెలువడనుంది. పోటీలో నిలిచిన అభ్యర్థుల ఉత్కంఠకు మంగళవారం తెరపడనుంది. అనంతపురం జేఎన్‌టీయూలో పటిష్ట భద్రత నడుమ ఓట్ల లెక్కింపుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

తొలి రౌండ్ 30 నిమిషాల్లోనే..

ఉదయం 8 గంటలకే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. 8:30 తర్వాత ఈవీఎంలు లెక్కిస్తారు. ఉరవకొండ 18 టెబుళ్లు, 15 రైండ్లు, రాయదుర్గం 14 టెబుళ్లు 22 రౌండ్లు, కళ్యాణదుర్గానికి 14 టేబుళ్లు, 19 రౌండ్లు లెక్కించనున్నారు. ఇందులో తొలి రౌండ్ 30 నిమిషాల్లోపు వెలువడనుంది. ఆ తర్వాత 15 నుంచి 20 నిమిషాల్లోపే అన్ని రౌండ్లు పూర్తి కానున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం ఒంటి గంట లోపు ఉరవకొండ, ఆ తర్వాత కళ్యాణదుర్గం , చివర్లో రాయదుర్గం ఫలితాలు వెల్లడవుతాయి.

కౌంటింగ్ కేంద్రానికి చేరుకున్న అభ్యర్థులు, ఏజెంట్లు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు మెట్టు గోవిందరెడ్డి, తలారి రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి సోమవారం సాయంత్రం కౌంటింగ్ ఏజెంట్లతో కలిసి అనంతపురం చేరుకున్నారు. ఉదయం 6 గంటలకే జేఎన్‌టీయూ కళాశాలలో నిర్వహించనున్న కౌంటింగ్ కేంద్రానికి హాజరయ్యేలా ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్‌లో ఏజెంట్ల విధి విధానాలపై అభ్యర్థులు ముందస్తుగా అవగాహన కల్పించారు. ప్రతి ఓటుపై దేగకన్ను వేసి ఉంచాలని, ఏమాత్రం తప్పు అనిపించినా ఆర్వో దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

తాగి వస్తే ఇంటికే..

లెక్కింపు ప్రక్రియకు వచ్చే ఏజెంట్లు తాగివస్తే బయటకు పంపిస్తారని, ఈ విషయంలో జాగ్రత్త వహించేలా పోలీసు అధికారులు హెచ్చరించారు. జేఎన్‌టీయూ ప్రాంతాన్ని నో స్మోకింగ్.. నో ఆల్కాహాల్ జోన్‌గా ప్రకటించారని గుర్తు చేశారు. కౌటింగ్‌కు వచ్చే వారందరినీ బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి, లోపలకు పంపుతారని తెలిపారు. ఆల్కాహాల్ మోతాదు శరీరంలో ఉంటే బ్రీత్ ఎనలైజర్ కనిపెట్టేస్తోందన్నారు.

పోలీసుల ఆధీనంలోకి గ్రామాలు..

ఆదివారం సాయంత్రం నుంచే 144 సెక్షన్ అమల్లోకి తీసుకురావడంతో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ పట్టణ ప్రాంతాలతో పాటు సమస్యాత్మక గ్రామాల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. నిత్యం రద్దీగా ఉండే పట్టణ ప్రాంతాలను సైతం పోలీసుల ఆధీనంలోకి తీసుకున్నారు. నలుగురు ఎక్కడ గుమిగూడనీకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా గ్రామాల్లోనూ మొబైల్ టీమ్‌లతో గస్తీ నిర్వహించారు.

ఎవరి ధీమా వారిదే

కళ్యాణదుర్గం: సార్వత్రిక ఎన్నికల్లో చివరి అంకం కౌంటింగ్. మంగళవారం ఓటరు తీర్పు వెలువడనుంది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే కౌంటింగ్‌పై అన్ని రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ సారి కళ్యాణదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా 261 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2,30,785 మంది ఓటర్లు ఉండగా, మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 2,04,297 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతపురం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 88.89 శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

19 రౌండ్లు...14 టేబుళ్లు:

నియోజకవర్గంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు 15 మంది బరిలో ఉన్నారు. 261 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2,04,297 మంది ఓటర్ల తీర్పును అధికారులు 14 టేబుళ్లలో 19 రౌండ్ల పాటు లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,614 ఉండగా, నాలుగు టేబుళ్లలో రెండు రౌండ్లు లెక్కించనున్నారు.

వైఎస్సార్‌సీపీ వైపే గెలుపు అవకాశాలు:

నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైపే గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని పలు సర్వేల ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేస్తున్నాయి. ఇందుకు వైఎస్సార్‌సీపీ గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా అర్హులకు నేరుగా ఖాతాలకు సంక్షేమ పథకాల నగదు జమ చేయడం, ఇంటింటికీ వెళ్లి పథకాలను అందజేయడం, పారదర్శకంగా పథకాలు వర్తింపజేయడం తదితర అంశాలు నచ్చి ప్రజలు మరోసారి వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎంపీ కావడం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా వచ్చిన అనతి కాలంలోనే నియోజకవర్గానికి రూ.కోట్లు నిధులు వెచ్చించి, శాశ్వత సమస్యలను పరిష్కరించారు. 30-40 ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జిలు, రహదారులను నిర్మించారు. ఉన్నత విద్యావంతుడు కావడం, అవినీతి రహితుడనే పేరు ఉండటం కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

అందరి చూపు..ఉరవకొండ వైపు..

ఉరవకొండ: ఎన్నికల రణరంగంలో ఆఖరి ఘట్టం కౌంటింగ్‌తో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. సార్వత్రిక విజేతలు ఎవరో, పరాజితులెవరు? .. ఏపార్టీ అభ్యర్థికి ఎంత మెజార్టీ వస్తుందో మంగళవారం తేలుతుంది. మెజార్టీ తగ్గే మండలాలు యువత, మహిళలు, వృద్ధులు ఎవ్వరికి పట్టం కట్టారు లాంటి అనేక ప్రశ్నలకు సమాధానం దొరుకుతుంది. ఈదఫా పోలింగ్ శాతం పెరిగింది. ఉరవకొండ ఫలితంపై జిల్లా **అంతటా ఆసక్తి :** ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఫలితంపై జిల్లా వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈఎన్నికల్లో సెంటిమెంట్ బద్దలు కొట్టి ఓటర్లు కొత్త చరిత్రకు నాందీ పలకనున్నారా? అన్న ప్రశ్న ప్రతి ఒక్కరిలో ఉంది. ఐదేళ్ల జగనన్న పాలనపై సంతృప్తిగా ఉన్న ప్రజలు.. వైఎస్సార్‌సీపీకి మంచి మెజార్టీతో పట్టం కట్టబోతున్నట్లు రాజకీయ విశ్లేషకులు ఇప్పటికే స్పష్టం చేశారు. ఉరవకొండ నుంచి సార్వత్రిక ఎన్నికల బరిలో 11 మంది అభ్యర్థులు పోటీ పడినా, హేమాహేమీలైన వై.విశ్వేశ్వరరెడ్డి, పయ్యావుల కేశవ్ మధ్యనే పోటీ ఉంది. నియోజకవర్గంలో 263 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2,24,339 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,92,441 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 85.78 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఇందులో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,544 పడ్డాయి. జేఎన్‌టీయూలో మంగళవారం జరగనున్న కౌంటింగ్‌లో ఉరవకొండ నియోజకవర్గానికి సంబంధించి 19 టేబుళ్ల, 15 రౌండ్లలో ఫలితం తేలనుంది. జిల్లాలో ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఫలితం మధ్యాహ్నం 3గంటల లోపు వచ్చే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.

ఓట్లు, లెక్కించే రౌండ్లు ఇలా ..

నియోజకవర్గం	ఓట్లు	పోలైన ఓట్లు	లెక్కించే టెబుళ్లు	రౌండ్లు	పోస్టల్ బ్యాలెట్లు
రాయదుర్గం	2,64,352	2,27,248	14	22	1671
కళ్యాణదుర్గ	2,30,785	2,05,143	14	19	2,614
ఉరవకొండ	2,24,339	1,92,441	18	15	2,544



కౌంటింగ్‌కు సిద్ధం చేసిన ఈవీఎంలు

ఘనంగా ఎంపీ రంగయ్య జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్యకు స్వీటు తినిపిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం: అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ తలారి రంగయ్య జన్మదిన వేడుకలు అట్టహాసంగా సోమవారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, కోఆప్షన్ సభ్యుడు అఫ్జల్‌లు ఎంపీ రంగయ్య సమక్షంలో కేక్ కట్ చేసి స్వీటు తినిపించి, శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం జరగనున్న ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శివారెడ్డి, బాషా, రామిరెడ్డి, ఉమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులతో కిక్కిరిసిన స్టేట్ బ్యాంకు



వజ్రకరూరు: స్థానిక భారతీయస్టేట్ బ్యాంకు పింఛన్‌దారులతో సోమవారం కిక్కిరిసిపోయింది. వజ్రకరూరుతోపాటు వివిధ గ్రామాలకు చెందిన పింఛన్‌దారులు ఉదయమే బ్యాంకు చేరుకొని క్యూకట్టారు. రెండునెలలుగా పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. ఈనెల1న పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం పింఛన్‌దారులు స్టేట్ బ్యాంకుకు క్యూకట్టారు.